పి.వి. సింధు ఒలింపిక్స్‌లో ఆడుతూ ఉండగానే,
ఆవిడ కులం ఏమిటి అని గూగుల్ చేసి భారతీయులు చాలామంది
తామేమిటో నిరూపించుకున్నారు. ఇలాంటి ఇరుకు, మురికి, వెకిలి మనస్తత్వమే
ఈ దళిత క్రైస్తవ కథకు ప్రేరణ. ఏ దేవుడూ, ఏ మతమూ, ఏ భావజాలమూ
ఈ కులజాడ్యాన్ని రూపుమాపలేకపోతున్నాయి. ఈ సామాజిక వాస్తవానికి
కథాపటం కట్టడం మాత్రమే నేను చేశాను.

పి.వి. సునీల్‌కుమార్

7

# పరిశుద్ధ వివాహము: మూడో ప్రకటన





“హైదరాబాదు కుకట్‌పల్లి వాస్తవ్యులు శ్రీయలమంచిలి అబెద్నగో, బైరెడ్డి శారా అమ్మగార్ల ఏకైకపుత్రిక కుమారి యలమంచిలి హెప్సిబాను అమెరికాలోని మిచిగన్ వాస్తవ్యులు గన్నమనేని లూథర్, గన్నమనేని రాజకుమారిగార్ల ప్రథమ కుమారుడు చిరంజీవి శామ్సన్ లూథర్‌కు ఇచ్చి పరిశుద్ధ వివాహము జరిపించుటకు పెద్దలు నిర్ణయించినారు. ఇట్టి వివాహము జరుగుట సమ్మతము కాదని ఎవరైనా హేతుబద్ధమైన కారణము ఉన్నయెడల తమ అభ్యంతరము తెలియచేయవచ్చును. ఒకవేళ తమ అభ్యంతరములను ఇప్పుడు తెలియపరచని ఎడల మరి ఎప్పటికిని మాట్లాడరాదు. ఇది ఈ వివాహ నిమిత్తమై చేయుచున్న తొలి ప్రకటన.”

ఈ ప్రకటన కోసమే కాసుకుని కూర్చున్నారు వారంతా.

✤

ఆదివారం కావటం వల్ల చర్చి కళకళలాడిపోతోంది. లెంటు డేసు ముగింపు దగ్గరకు రావడంతో ఎండతో పాటు పెళ్లిళ్ల సీజను కూడా రైజింగులో ఉంది.

ఇస్కరియోతు యూదా అనే కోవర్టు ఏసుప్రభువును పట్టించాడు. ఆ తరువాత ఆయన్ను సిలువపై మేకులు కొట్టి చంపారు. ఈ సిలువ కార్యక్రమానికి నలభైరోజులు ముందునుంచీ ఈ శ్రమ దినాలు మొదలవుతాయి. ఈ సమయంలో పెళ్లిళ్లు, ఇతర వేడుకలు చేసుకోరు. చాలామంది ఉపవాసాలు ఉండి, ఒకపూట మాత్రమే తిని ప్రార్థనలో గడుపుతారు.

అటువంటి ప్రార్థనాయోధుల కుటుంబమే అబెద్నగోగారిది. శ్రమదినాల్లో ఆయనగానీ ఆయన భార్య శారాగానీ వారి కుమార్తె హెప్సిబా కానీ మెతుకు ముట్టరు. కన్నీటి ప్రార్థనలో గడుపుతారు. ప్రభువు పడ్డ శ్రమలు వారి ప్రార్థనలో వింటే ఎవరికైనా దు:ఖం ముంచుకు వచ్చి కన్నీరు తెలీకుండానే వస్తుంది.

‘ఇదిగో సమస్త జనుల పాపభారము మోసుకొని పోయే దేవుని గొర్రెపిల్ల,’ అని ప్రపంచ ప్రజల పాపభారాన్ని మోసిన క్రీస్తు గురించి యోహాను ప్రవక్త రాసిన మాటలు మొదటి అధ్యాయం ఇరవై తొమ్మిదో వచనం అబెద్నగోగారు కానీ, శారా అమ్మగారుగానీ హెప్సిబా పాపగానీ చదివారంటే అందులో ఉండే ఆర్ద్రతకి ఎవరైనా కరిగి కన్నీరవ్వ వలసిందే.

అబెద్నగోగారిని తెలిసినవారు అబెద్నగోవు అంటారు. గోవు లాంటి సౌమ్యుడు, ఉత్తముడు ఆయన. పరుషంగా మాట్లాడి ఎరుగడు. బూతులు కావు కదా కనీసం బూతు అనే పదం కూడా ఆయన నోటి వెంట రాలేదు ఇంతవరకూ. ఎవరికీ అపకారం చేయడు, చేయలేడు. నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించమన్న మార్కు సువార్త పన్నెండో అధ్యాయం, పదమూడో వచనంలోని దేవుడి ఆజ్ఞని అక్షరాలా పాటించేవాడు అబెద్నగో.

అసలు ప్రతీవాడు పక్కవాడిని ప్రేమిస్తే ఇన్ని గొడవలు, కలహాలు ఎందుకు ఈ ప్రపంచంలో? పాకిస్తానువాడు ఇండియావాడినీ, ఇండియావాడు చైనావాడినీ ప్రేమిస్తే ప్రపంచం ఎంత గొప్పగా ఉంటుంది?

అబెద్నగోగారి నుండి ఎవరైనా ఈ విషయం నేర్చుకోవలసిందే. అమెరికా ఒబామా కానీ చైనా జీ జిన్‌పింగ్ కానీ. అన్నట్టు చైనాలో కూడా బైబిలు దొరుకుతుంది కదా, చైనీస్ బైబిలు అయినా దేవుడి వాక్యం ఇలానే ఉంటుంది కదా.

అబెద్నగో కొంతకాలం ఇండియన్ నేవీలో కళాసీగా పనిచేశారు. అంటే నేవీలో అదే క్రింది మెట్టు. రిటైరుమెంటు తీసుకున్నాక మిఠాయి దుకాణం పెట్టారు. దాంట్లోనే పచ్చళ్ళు, కారంపొడులు కూడా అమ్ముతారు. అబెద్నగో అంటే నిజాయితీ కనుక ఆ దుకాణంలో ఎప్పుడూ నిలవ సరుకు అమ్మడం కానీ, క్వాలిటీ లేని సరుకు అమ్మడం కానీ ఉండదు. అందుకే ఆ దుకాణంలో అమ్మకాలు బావుంటాయి.

ఆర్థికంగా అబెద్నగోగారి కుటుంబం ఫర్వాలేదనే చెప్పాలి. కాకపోతే హెప్సిబా పాప పెళ్లి ఒకటి ఉండిపోయింది. హెప్సిబా తరువాతి వాడు విల్సన్ చదువు అబ్బక దుకాణంలోనే ఉంటున్నాడు. ఇంజనీరింగు ఒకటి ఏదో అయింది అంటే అయింది అనిపించాడు విల్సన్.

అయితే అబెద్నగోగారు కానీ, శారా అమ్మగారు కానీ  చాలా అందంగా వుంటారు. ఆ అందమే పిల్లలకి కూడా వచ్చింది.

విల్సను విద్యాగంధం అంటని శుంఠయే కానీ చూడ్డానికి కలెక్టరులా వుంటాడు.

హెప్సిబా అయితే ఇక చెప్పనక్కర్లేదు. ఆ పిల్ల అందమే అందం, అసలు హెప్సిబా అంటే హిబ్రూ భాషలో సంతోషాన్ని ఇచ్చేది అని. ఆమె అందమే ఆమె నుంచి సంతోషాన్ని జనింపచేసే విశేషం. ఆమె వదనం ప్రసన్నం. అధరం ఎర్రటి కెంపు, చూపులకు ఇంపు, నోరూరింపు.

విల్లుల్లా కనుబొమలూ, కదిలే ద్రాక్షగుత్తులు మధ్యలో పూచిన పాల మడుగుల్లా కళ్లు. తెల్లటి ఒళ్లు, నవ్వితే మెరిసే అందాల పళ్లు... గాల్లో తేలే నల్లటి మేఘంలా ఆమె జుత్తు. ఆమె నిజంగా పూచిన, కాచిన అందాల మామిడిచెట్టు...

చర్చిలో సగంమంది పాస్టరుగారిని చూస్తే సగం మంది హెప్సిబాను చూస్తూ ఉంటారు. పాస్టరుగారి వైపు చూస్తూ ఉండేది ఆడవాళ్లు.

చర్చిలో ఆడవాళ్లు ఆ ఆదివారం పూట గంజిపెట్టిన కాటను చీరలు కట్టుకుని తలపై ముసుగు వేసుకుని చేతిలో బైబిలు పట్టుకుని కూర్చున్నారు. కొంతమంది ఆడవాళ్లు పట్టుచీరలు కట్టుకు వచ్చారు. చీరలు కట్టేది పెళ్లయినవాళ్లు, వయసు అయినవాళ్లు.

వయసు పిల్లలు చక్కగా జీన్సు పాంట్లు, వాటి మీద టాప్స్, షర్ట్స్ లేదా టీ షర్ట్స్ వేసుకున్నారు. కొంతమంది మిడీలు వేసుకొచ్చారు. తక్కువ ఆదాయ వర్గాల వాళ్లు చుడీదార్ వేసుకున్నారు.

లిప్‌స్టిక్ మాత్రం సుమారుగా అందరూ వేసుకున్నారు.

ఫాదిరిగారు బైబిలు పట్టుకుని వాక్యం చెపుతున్నాడు. ఆయన సగం వాక్యం చదివి ఆపుతాడు. ఒక పదాన్ని రెట్టించి చెబితే మిగతా వాక్యం సంఘస్తులను అందు కోమని సూచన అన్నమాట.

ఆ వాక్యం పూరించడానికి కమేండోల్లా అప్రమత్తంగా ఉంటారు కొందరు ఆడవాళ్లు.

"లూకా సువార్త 22వ అధ్యాయము 33 ఇంకా 34 వచనాలు చదువు కుందాం. అయితే అతడు- ప్రభువా, నీతోకూడ చెరలోనికి మరణమునకు వెళ్లు టకు సిద్ధముగా ఉన్నానని..." పాస్టరుగారు ఆపాడో లేదో శారా అమ్మగారు అందు కుంది.

"ఆయనతో అనగా, ఆయన పేతురూ, నీవు నన్నెరుగవని ముమ్మారు చెప్పు వరకు నేడు కోడి కూయదని నీతో చెప్పుచున్నాను అనెను," అని పూర్తిచేసింది శారా అమ్మగారు.

పాస్టర్‌గారు చెప్పుకుపోతూ ఉన్నాడు. "మనయొక్క నమ్మకము ఎంత బలహీనమైనది అంటే పేతురు అంతటి మహా భక్తుడు, ప్రభువు శిష్యుడు ఆపద రాగానే మూడుసార్లు ఏసు ఎవరో తనకు తెలియదని బుకాయించినాడు. మనము కూడా అలానే ప్రభువును విడిచిపెట్టుచున్నామా? మన తలంపులలో, ఆచరణలో ఎన్నిమార్లు ప్రభువు మనకు తెలియనట్లు మనము ఉంటున్నాము..."

జక్రయ్య పాస్టరుగారు చక్కటి వాక్యం చెపుతాడు. ఆయన వాక్యం ముగించి దీవెనలు పొందినవారు ప్రత్యేక కానుకలు సమర్పించి ఆశీర్వాదం పొందమని ప్రకటన చేశాడు.

జబ్బుపడి కోలుకున్న వాళ్లు, విదేశాలకు వెళ్లేవాళ్లు, ఈ మధ్య ఉద్యోగం వచ్చిన వాళ్లు, పరీక్షల్లో బాగా రాయాలనుకునే వాళ్లు ఇలా చాలామంది కవర్లలో డబ్బులు పెట్టుకుని పాస్టరుగారి దగ్గర ఉన్న పళ్లెంలో ఆ కానుకలు పెట్టారు. వారి నిమిత్తం ప్రార్థన జరిగింది.

ఆ తరువాత పులిపాక జగన్నాథంగారు వ్రాసిన, "నావన్నీ అంగీకరించుమీ దేవా... నన్నెపుడూ నీవు కరుణించుమీ..." అన్న ఆంధ్ర క్రైస్తవ కీర్తనతో మొదలైన

సంఘకానుకల సేకరణ పురుషోత్తమచౌదరిగారు రాసిన, "నన్ను గన్నయ్య రావె నా యేసు. నన్ను గన్నయ్య రావె నా ప్రభువా..." అన్న కీర్తనతో ముగిసింది.

సంఘకానుకల ప్రార్థన అయిపోయిన తరువాత ఆరాధనాక్రమంలో వివాహ ప్రకటనలు చదివే కార్యక్రమం వచ్చింది.

క్రైస్తవ వివాహంలో మొదటి అంచె ఈ వివాహ ప్రకటనలు చదివే కార్యక్రమం, ఎవరైనా క్రైస్తవులు చర్చిలో పెళ్లి చేసుకోదలచినపుడు వారి పేర్లు ఇస్తే పాస్టరుగారు మూడు వారాల పాటు ప్రతీ ఆదివారం చర్చిలో ప్రకటన చేస్తారు. ఫలానా వారు వివాహం చేసుకోదలుచుకున్నారు, ఎవరికైనా అభ్యంతరం ఉంటే చెప్పమని. ఆ మూడువారాల తర్వాత ఎప్పుడైనా ఆ పెళ్లి చేసుకోవచ్చు.

"హైదరాబాదు కుకట్‌పల్లి వాస్తవ్యులు శ్రీయలమంచిలి అబెద్నగో, బైరెడ్డి శారా అమ్మగార్ల ఏకైకపుత్రిక కుమారి యలమంచిలి హెప్సిబాను అమెరికాలోని మిచిగన్ వాస్తవ్యులు గన్నమనేని లూథర్, గన్నమనేని రాజకుమారిగార్ల ప్రథమ కుమారుడు చిరంజీవి శామ్సన్ లూథర్‌కు ఇచ్చి పరిశుద్ధ వివాహము జరిపించుటకు పెద్దలు నిర్ణయించినారు. ఇట్టి వివాహము జరుగుట సమ్మతము కాదని ఎవరైనా హేతుబద్ధమైన కారణము ఉన్నయెడల తమ అభ్యంతరము తెలియచేయవచ్చును. ఒకవేళ తమ అభ్యంతరములను ఇప్పుడు తెలియపరచని ఎడల మరి ఎప్పటికిని మాట్లాడరాదు. ఇది ఈ వివాహ నిమిత్తమై చేయుచున్న తొలి ప్రకటన."

✤

నిజానికి ఆ పెళ్లి కుదిర్చిన పెద్దల్లో ముఖ్యుడు జక్రయ్య పాస్టరుగారు. జక్రయ్యగారి భార్యగారి అక్కగారు అంటే వదినగారు అమెరికాలోని మిచిగన్‌లోని తమ పాప దగ్గరకు వెళ్లినపుడు అక్కడ పరిచయమయ్యారు లూథర్‌గారి కుటుంబం.

అమెరికాలో స్థిరపడ్డ తెలుగు కుటుంబాల్లో బాగా ఉన్నవాళ్లే వాళ్లు. లూథర్, రాజకుమారి ఇద్దరూ డాక్టర్లే, లూథర్ కార్డియాక్ సర్జన్. రాజకుమారి కూడా డాక్టరే. శామ్సన్ కాక ఇంకో అబ్బాయి కూడా ఉన్నాడు. శామ్సను, అతడి తమ్ముడితో కలిసి ఓ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీ నడుపుతున్నాడు. గ్రీన్ కార్డు ఫేమిలీ అది.

తమ పిల్లలకి తెలుగు సంబంధాలు ఏమైనా ఉంటే చెప్పమని అడిగారు లూథర్. తాము నాలుగు తరాలుగా పుట్టు క్రైస్తవులం కనుక తమకి కూడా పుట్టుకతో క్రైస్తవురాలైన అమ్మాయి ఉంటే చూడమని చెప్పారు రాజకుమారి.

"అమ్మాయి అందంగా ఉండి, ప్రేయర్‌ఫుల్ అయి ఉంటే చాలునండీ మేమేమీ ఆశించం. పెళ్లి వాళ్లు చేయలేకపోయినా మేమే చేసుకుని ఇక్కడికి తెచ్చుకుంటాం," అంది ఆవిడ.

పుట్టినపుడు హిందూ మతం కానీ మరేదైనా మతంలో ఉండి తరువాత క్రైస్తవంలోకి మారినవారిని కన్వర్టెడ్ అనీ, తల్లీతండ్రీ అప్పటికే క్రైస్తవమతంలో ఉండగా పుట్టినవాళ్లని పుట్టు క్రైస్తవులనీ వాడుకలో అంటూ ఉంటారు. ఈ పుట్టు క్రైస్తవుల

బేహద్బీ చూడవలసిందే కానీ వర్ణించడానికి వశం కాదు. చైనాను పరిపాలించిన మింగ్ చక్రవర్తుల వంశం తమదైనట్టూ, డబ్బా చైనా ఫోను వాడే వంశం మిగతావారిది అయినట్టూ ఉంటారు.

"తప్పకుండా అమ్మగారూ... మా మరిదిగారు దైవపరిచర్యలోనే ఉన్నాడు. జక్రయ్యగారని గొప్ప దైవజనుడు. ఆయనకి చెబుతాను. మంచి సంబంధాలు మీకు ఈమెయిల్లో పంపిస్తాము. మీరు ఇండియా వచ్చినపుడు మీకు నచ్చిన సంబంధం ఖాయం చేసుకుందురుకాని," అన్నది జక్రయ్య వదినగారు. ఆ తరువాత జక్రయ్య వదినగారు ఆ ముక్క అక్కడినుండే స్కైపులో జక్రయ్యగారికి వినిపించడమూ, ఆయన వెంటనే మార్టిన్‌గారి మెయిలుకి ధనధనామని ఓ ఇరవైమంది కత్తుల్లాంటి అమ్మాయిల ఫోటోలు పంపించడమూ, (అంటే ఇరవై సంబంధాలని అర్థం) వెనువెంటనే జరిగిపోయాయి.

ఆ ఇరవైమంది నైపుల్లోంచి శామ్సన్‌కు వైపుకాగల డిలైలా కోసం చాలా వడపోత జరిగింది. చివరికి ఆ అదృష్టం హెప్సిబాను వరించింది.

హిందువుల్లో అయితే అమ్మాయికానీ, అబ్బాయికానీ నచ్చితే జాతకం చూస్తారు. క్రైస్తవుల్లో అయితే ఆ విషయం ప్రార్థనలో పెడతారు.

"హెప్సిబా అనే కన్యను మేం శామ్సన్‌కు భార్యగా చేసుకోవాలని ఆశ పడుచుండగా మాకు ఏది మేలైనదో, మీచే ఏర్పాటు చేయబడిన వధువు ఆమెయే అయితే మాకు ఆ విషయం తెలియునట్లు చేయుమని ప్రార్థించుచున్నా," అని ప్రార్థన చేస్తారు.

ఆ ప్రార్థనకి అవునని కానీ కాదని కానీ సమాధానం వస్తుంది. అది ఎలా అనేది చెప్పలేం. ప్రార్థనలో ఉండగా ఎవరికో దేవుడు అవును అని చెప్పినట్టు తోస్తుంది. లేదా ఏదైనా కల వస్తుంది. ఆ కల శుభసూచకంగా ఉంటే దేవుడు చెప్పినట్టుగా భావించి ఆ పెళ్లి జరిపిస్తారు.

దీన్నే ప్రార్థనలో పెట్టడం అంటారు.

రాజకుమారిగారికి కల వచ్చింది. ఆ కలలో ఓ స్త్రీ ఏదేనువనము లాంటి వనంలో ఓ చెట్టు కింద ఉన్నట్టుగా కనపడింది.

ఆదికాండము ప్రకారం దేవుడు ముందుగా తన రూపంలో మనుషుని సృష్టించాడు. అతడి పేరు ఆడమ్, తెలుగులో ఆదాము. తరువాత రకరకాల జంతువులు, పక్షులు సృష్టించాడు. వాటికి పేర్లు ఆ మనిషినే పెట్టమన్నాడు. వాటిలో మనిషికి సహచరియై ఉండగల జీవి దేవుడికి కనపడలేదు. మనిషి ఒంటరిగా వుండటం మంచిది కాదని దేవుడికి అనిపించింది. అందుకే ఆయన ఆదామును నిద్రలోకి పంపి అతడి పక్కటెముకను ఒకదానిని తీసి దానితో ఈవ్ అనే స్త్రీని తయారు చేశాడు. మేన్ నుండి తయారయినది కాబట్టి ఉమెన్ అన్నాడు.

క్రైస్తవంలో భార్య భర్తలో అంతర్భాగం. అందుకే విడాకులకి క్రైస్తవంలో స్థానం లేదు. భర్త నుండి స్త్రీ విడిపోవడం వ్యభిచారం అని చెప్పారు.

పెళ్లి అనేది అన్ని విషయాలలో గొప్పది అని చెప్పారు కొరింథీయులకు రాసిన పత్రికలో.

రాజకుమారిగారి కలనుబట్టి దేవుడు ఆదాముకు అవ్వను ఏర్పాటుచేసినట్టుగా ఇంగ్లీషులో శామ్సను, తెలుగులో సంసోనుకు హెప్సిబాను ఏర్పాటుచేసినట్టు భావించారు.

✤

"హైదరాబాదు కుకట్‌పల్లి వాస్తవ్యులు శ్రీయలమంచిలి అబెద్నగో, బైరెడ్డి శారా అమ్మగార్ల ఏకైకపుత్రిక కుమారి యలమంచిలి హెప్సిబాను అమెరికాలోని మిచిగన్ వాస్తవ్యులు గన్నమనేని లూథర్, గన్నమనేని రాజకుమారిగార్ల ప్రథమ కుమారుడు చిరంజీవి శామ్సన్ లూథర్‌కు ఇచ్చి పరిశుద్ధ వివాహము జరిపించుటకు పెద్దలు నిర్ణయించినారు. ఇట్టి వివాహము జరుగుట సమ్మతము కాదని ఎవరైనా హేతుబద్ధమైన కారణము ఉన్నయెడల తమ అభ్యంతరము తెలియచేయవచ్చును. ఒకవేళ తమ అభ్యంతరములను ఇప్పుడు తెలియపరచని ఎడల మరి ఎప్పటికిని మాట్లాడరాదు. ఇది ఈ వివాహ నిమిత్తమై చేయుచున్న రెండవ ప్రకటన."

ఆరాధన ముగిసిన తర్వాత హెప్సిబా దగ్గరకు వచ్చి అభినందిస్తున్నారు సండే స్కూలు టీచర్సు. హెప్సిబా సండే స్కూలు అమ్మాయి చిన్నతనం నుండీ. హిందువులకు వేద పాఠశాలలాగా, ముస్లిములకి మదరసాలాగా క్రైస్తవులకి సండే స్కూలు. ఆదివారం పూట చర్చి మొదలవడానికి ముందుకానీ తరువాతగానీ ఇది జరుగుతుంది. బైబిలు పాఠాలు, కీర్తనలు నేర్పిస్తారు. బాండు ప్రాక్టీసు కూడా ఉంటుంది.

"మాకు తెలుసు. హెప్సిబాలాంటి అందమైన, మంచి దేవుడిబిడ్డని ఎవరో గొప్ప అబ్బాయి వచ్చి చేసుకుంటాడని," అన్నారు సండే స్కూలు టీచరు.

"అవునండీ వారి ఆర్థిక స్తోమతతో పోల్చుకుంటే మేం వారిలో వందో వంతు కాదు, వెయ్యోవంతు కూడా చెయ్యము. చదువు, మిగతా విషయాల్లో వారు చాలా అధికులు," అన్నారు అబెద్నగో.

"ఇది హెప్సిబా అదృష్టం. ఆ ప్రభువు కృప. మా తాహతుకు అటువంటి సంబంధం తేవడం అనేది ఎట్టి పరిస్థితుల్లో జరుగదు. ఇది దేవునియొక్క ఆశ్చర్య కార్యం" అంది శారా అమ్మగారు కళ్లనీళ్లతో.

"అన్నీ ఆ ప్రభువే చూసుకుంటాడు. మీ అబ్బాయికి కూడా వాళ్లో దారి చూపించగలరు," అంది జక్రయ్య పాదిరిగారి వదిన.

మొత్తానికి వచ్చేవారం ఇండియాకి రాబోతున్న గన్నమనేని లూథర్‌గారి కుటుంబం గురించీ వారి మంచితనం గురించీ చాలా చర్చ జరుగుతోంది.

పెళ్లి ఎలాగూ చర్చిలోనే జరుగుతుంది. విందు అమెరికా వారి తాహతుకు తగ్గట్టు ఏదైనా పెద్ద గ్రౌండులో కానీ స్టేడియంలో కానీ జరపాలని లూథర్‌గారి

కుటుంబం తలంచింది. ఆ బాధ్యత కూడా లూథర్‌గారు తమ కాబోయే వియ్యం కుడు అబెద్నగోగారి మీద పెట్టారు.

వేదిక చూడటం, ఏర్పాట్లు చేయడమే అబెద్నగో గారి బాధ్యత. ఖర్చు యావత్తు లూథర్‌గారు భరిస్తారు. అబెద్నగోగారు ఏమైనా పెట్టుకోవాలంటే తమ పిల్లకి పెట్టుకోవచ్చు.

లూథర్‌గారి కుటుంబం ప్లాన్ ఒక్క రెండురోజులకి మాత్రం వచ్చి పెళ్లి చూపులు, తాంబూలాలు చాలా సింపుల్‌గా కానిచ్చి అమెరికా వెళ్లిపోయారు. అక్కడి అపాయింట్‌మెంట్లు పూర్తి చేసుకుని పెళ్లికి వారం ముందు దిగుతారు.

ఇది అనుకోనివిధంగా కుదిరిన పెళ్లి కావడంతో వారికి తమ అపాయింటు మెంట్లు పూర్తిచేసుకుని రావడానికి కాస్త సమయం పడుతోంది.

లూథర్‌గారి బంధువు ఒకాయిన కాకినాడలో ఆర్డీవోగా చేస్తున్నాడు. పెళ్లి ఏర్పాట్లు చూడ్డానికి ఆయన్ని పంపిస్తున్నారు లూథర్‌గారు, తమ కాబోయే బావగారు అబెద్నగోగారి ఇంటికి.

✤

ఇంతకీ ఆ ఆర్డీవోగారేమీ కొత్తమనిషి కాదు. ఆయన ఇంతకు మునుపు మైనా రిటీ ఫైనాన్సు కార్పోరేషన్లో పనిచేసినపుడు అబెద్నగోగారు తమ మిఠాయి దుకాణం వ్యాపారం పెంచుకోవడానికి అప్పు ఇప్పించిన మహానుభావుడు. అతడు అబెద్నగో గారికి చాలా సాయం చేశాడు.

"మీకు చాలా రుణపడిఉన్నాను. ఎలా తీర్చుకోవాలో," అన్నారు అబెద్నగో గారు లోను అందుకున్నపుడు.

"అయ్యా. కార్పోరేషను రుణం కట్టి తీర్చుకోండి. నాకు రుణపడి ఉంటే ఆ ప్రభువే తీర్పించుతాడు," అన్నారు ఆర్డీవో.

ఆర్డీవోగారు ఆత్రేయపురం పూతరేకు, పండూరోడి మామిడిపళ్లు, అవిడి పాలకోవాలతో దిగాడు.

ఆయన్ని చూసి ఆనందపడిపోయాడు అబెద్నగోగారు. అబెద్నగో అంతటి ఉత్తముడితో తమ బంధువు వియ్యం అందబోవడం ఆర్డీవోగారికి కూడా చాలా సంతోషం కలిగించింది.

అయ్యా, తమరా అంటే తమరా అని అనుకున్నారు ఇద్దరూ.

కాఫీ ఫలహారాలు అయ్యాక మాటల్లో ఆర్డీవోగారు అన్నారు. "అప్పుడు తమరు అన్నారు నా రుణం ఎలా తీర్చుకోవాలా అని... ఇప్పుడు నా తమ్ముడు లూథర్ కొడుక్కి మీ అమ్మాయిని ఇస్తున్నారు. ఈ బంగారుతల్లిని ఇవ్వడం ద్వారా నా రుణం తీర్చు కుంటున్నారు."

"అయ్యా... తమరికి లూథర్‌గారు ఎలా బంధువు? ఏదైనా వివాహం వల్లనా?" అని అడిగారు అబెద్నగో చాలా మెత్తగా.

“లేదండీ రక్తబంధువు. మా తండ్రిగారూ... లూథర్ తండ్రిగారూ అప్పచెల్లెళ్ల బిడ్డలు. ఒకే ఇంటి ఆ ఇద్దరూ ఒకే ఇంటికి కోడళ్లు. మొత్తానికి హెప్సిబా మా గన్నమనేని వారి కోడలు అవుతోంది,” అన్నాడాయన.

అబెద్నగోగారి మొహం ఎందుకో పాలిపోయింది.

మంచీ చెడూ మాట్లాడాక ఆర్డీవోగారు వెళ్లిపోయాడు.

✤

తాను చేసిన తప్పేమిటో తెలీక జక్రయ్య బిక్కచచ్చిపోయి ఉన్నాడు. అబెద్నగో గారు అబెద్నగోవులాగే ఉన్నాడు. కాకపోతే కొమ్ములతో కుమ్ముతున్న గోవులాగా ఉన్నాడు.

“పెళ్లి అంటే ఏడు తరాల చరిత్ర చూడాలంటారు. ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు చూడాలని చెబుతారు. ఎలా తెచ్చావీ బోడి సంబంధం,” అన్నాడాయన.

“ఏం పొరపాటు జరిగింది మహాప్రభో,” అడిగాడు జక్రయ్య.

“నువ్వు కూడా మాల పాస్టరువు కాదుకదా జక్రయ్యా... మా కులం శారా అమ్మగారి కులం నీకు తెలుసు. మరి ఈ మాల సంబంధం ఎలా తెచ్చావు?” అడిగాడు అబెద్నగో.

“అయ్యా... మనం క్రైస్తవులం... అందరు క్రైస్తవులు ఒకటే కదా అని...” అంతకుమించి గొప్ప డిఫెన్సు ఏమీ దొరకలేదు జక్రయ్యకి.

“ అరె... కాదని ఎవరన్నారండి. క్రైస్తవులుగా అందరం ఒకటే. ఒకటే బైబిలు. ఒకడే దేవుడు. కానీ పెళ్లి దగ్గర కాదుకదా. ఇదేమన్నా ఒకపూట కలిసి భోజనం చేయడమా... ప్రతీరోజూ జీవితాంతం కాపురం చేయడం. కులం గోత్రం చూసుకో వద్దూ,” అన్నారు అబెద్నగో.

“తమదీ అమ్మగారిదీ కూడా ఇంటరు కేస్టు పెళ్లికదా అనీ...” జక్రయ్య, కేసు ఓడిపోతున్న లాయరు దీనంగా జడ్జిగారిని చూసినట్టు చూసి అన్నాడు.

“అవునండీ నేను యలమంచిలి వారి కమ్మ అబ్బాయిని. శారా అమ్మగారు బైరెడ్డి వారి రెడ్డి ఆడపడుచు. ఇది ఇంటరుకేస్టు క్రైస్తవ వివాహమే కానీ విధం చెడ్డది కాదు. మేమేమీ మాలమాదిగలను చేసుకోలేదే. హిందూమతంలో శూద్రులందరిదీ ఒకటే స్థాయి వర్ణాన్నిబట్టి. కానీ అందరూ శూద్రులమే అని ఉన్నా వంద కులాల్లో చాకలి, మంగలి, మేదరి, కుమ్మరి వారిని కమ్మవారు, రెడ్డి కులస్తులు చేసుకోరు కదా... అలానే క్రైస్తవంలో కూడా అందరూ ఒకటే అయి ఉన్నా కొన్ని మనం పాటించాలి. తప్పదు. తాళి కట్టడం క్రైస్తవమా? పసుపుతాడు కట్టడం క్రైస్తవమా? అక్షింతలు క్రైస్తవమా? కట్నం క్రైస్తవమా? ఆడపడుచు లాంఛనాలు క్రైస్తవమా? మరి ఇన్ని ఆచారాలు ఇక్కడివే తీసుకున్నపుడు ఈ ముఖ్యమైన విషయం ఎలా మర్చిపో తారు? నువ్వు మాల పాదిరివో మాదిగ పాదిరివో అయితే నిన్ను నమ్మకపోదును. అన్నీ తెలిసీ నువ్వు ఇలా చేస్తావా? ఈ విషయం నేను బయట మాట్లాడలేను. ఇదీ

కారణం అని చెప్పలేను. కానీ రేపు లోకం మమ్మల్ని చూసి నవ్వదా? శారా అమ్మగారి కులస్తులుకానీ, మనవాళ్లు కానీ దగ్గరకి చేరనిస్తారా? వాళ్లు చదువులో, అంతస్తులో, డబ్బులో ఎంత ఎక్కువ వాళ్లయినా కానీ, ఈ విషయంలో మనకంటే ఎంత చిన్న వాళ్లు? వారి డబ్బు అంతస్తు మాకు ఏదో ఒకరోజు రావచ్చు. కానీ మా కులంవాళ్లకి ఎప్పటికీ రాదు. అంతెందుకు జక్రయ్యా.. మాల మాదిగలే చేసుకోరు ఎక్కువ తక్కువ అని. మనమెందుకు చేసుకోవాలి?'' అబెద్నగోవుగారు.

''అయ్యా. గన్నమనేని ఇంటిపేరు మనవాళ్లలోనే కాక వాళ్లలో కూడా ఉందని మాకు తెలీక ఈ పొరపాటు జరిగింది. క్షమించండి,'' అన్నాడు జక్రయ్య.

✤

''ఆయనతో అనగా, ఆయన పేతురూ, నీవు నన్నెరుగవని ముమ్మారు చెప్పు వరకు నేడు కోడి కూయదని నీతో చెప్పుచున్నాను అనెను. '' అని శారా అమ్మగారు వాక్యం చదువుతూనే ఉంటారు.

క్రైస్తవంలో కులం లేదని రెండు ముమ్మారులు అనగా ఆరుదినములు అబద్ధము ఆడిన తర్వాత కానీ ఆదివారము రాదని ఏ ప్రభువూ చెప్పలేదు.

అభ్యంతరాలు అన్నీ ఆలయంలోనే చెప్పకర్లేదు. మైకుకి వినపడనివి, కంటికి కనపడనివి చాలా ఉంటాయి. అసలు కుట్ర అంటేనే కనపడనిది, వినపడనిది. వివాహము అన్ని విషయాల్లో గొప్పది అని ప్రభువు చెప్పాడు. కులం దానికంటే గొప్పదని చెప్పే ప్రభువులు మన మధ్యే ఉన్నారు.

గన్నమనేని శామ్సను, యలమంచిలి హెప్సిబాల పరిశుద్ధ వివాహానికి సంబంధించిన మూడవ ప్రకటన జక్రయ్య చదవనేలేదు.

ఇందుకు మీకు అభ్యంతరము ఉన్న యెడల ఎప్పటికీ మాట్లాడుచునే ఉండండి... ఆమెన్.

*విశాలాంధ్ర*
*21 జూన్ 2015*

✱




పి.వి. సునీల్‌కుమార్ పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడిలో పుట్టారు. వయస్సు 47. వీరి మొదటి కథ మూషికార్జునీయం స్వాతి వార పత్రికలో 1986లో అచ్చయింది. ఐజి స్థాయి ఐపిఎస్ అధికారి. *50కి* పైగా కథలు, మూడు నవలలు రాశారు. కథాసంపుటి ప్రచురించారు. వీరి దెయ్యం కథను వీకెండ్ మూవీ మేకర్స్, రోహిత్‌శర్మ దర్శకత్వంలో లఘుచిత్రంగా నిర్మించారు.

*చిరునామా: 102, శ్రీనివాస రెసిడెన్సీ, హిమాయత్‌నగర్*
*హైదరాబాద్-500 029 ఫోన్: 94407 17171*
***sunil999@gmail.com***